సాక్షి
నారాయణపేట
బుధవారం : 12 : ఫిబ్రవరి : 2025



'నవోదయ'కు కసరత్తు

పాలమూరులో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



నేడు జమ్మిచేడులో వేడుకలు

జమ్మిచేడులో జములమ్మ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.3 /16.4

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

నారాయణపేట: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ యోగేష్ గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇసుకాసురులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై పోలీసుశాఖ దాడులను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రజలు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. పోలీసు వారి సూచనలకు విరుద్ధంగా ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఇసుక తరలించేందుకు, విక్రయించేందుకు అనుమతి ఉందన్నారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

నారాయణపేట రూరల్: మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వైష్ణవాలయాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు నారాయణపేట డిపో మేనేజర్ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారులోని ఏక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి, మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి క్షేత్రాలకు బుధ, గురు వారాల్లో ప్రత్యేక బస్సులను నడిపించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసు పహారా మధ్య భూ సర్వే



ఊట్కూర్/దామరగిద్ద: నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా ఊట్కూర్ మండలం బాపూర్ శివారులో చేపట్టిన భూ సర్వే మంగళవారం పోలీసు పహారా మధ్య కొనసాగింది. బాపూర్ శివారులోని 20 ఎకరాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్, సంపుహౌజ్ నిర్మాణాల కోసం ఐదు రోజుల క్రితం సంబంధిత అధికారులు భూ సర్వే చేపట్టగా.. గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ లింగయ్య, సీఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో అధికారులు భూ సర్వే పనులు చేపట్టారు. అదే విధంగా దామరగిద్ద తండా సమీపం నుంచి రోడ్డు నిర్మాణ పనులను ముమ్మరం చేసినట్లు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్లు దయాకర్‌రెడ్డి, అమరేంద్ర కృష్ణ, చింత రవి, ఇరిగేషన్ డీఈ కేతన్ కుమార్, ఏఈలు వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.6,269

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ. 6,269, కనిష్టంగా రూ. 3,869 ధర పలికింది. ఎర్రకందులు గరిష్టంగా రూ. 7,750, కనిష్టంగా రూ.6,222, తెల్ల కందులు గరిష్టంగా రూ. 8వేలు, కనిష్టంగా రూ. 6,212 ధరలు వచ్చాయి.

రైతు కష్టం దళారులపాలు

కూరగాయల రైతును నిండా ముంచుతున్న వ్యాపారులు



అప్పంపల్లిలో సాగుచేసిన పచ్చిమిర్చి

- అన్నదాత నుంచి తక్కువ ధరకు కొనుగోలు
- రెండు, మూడింతలు అధిక ధరకు బయటి మార్కెట్‌లో విక్రయాలు
- క్రమంగా తగ్గుతున్న కూరగాయలు సాగు
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల మొగ్గు
- జిల్లాలో కూరగాయల దిగుబడి 16 టన్నులు.. అవసరం 135 టన్నులు

జిల్లా వివరాలిలా..

మొత్తం జనాభా	కూరగాయల సాగు (ఎకరాల్లో)
6,72,975	1,135
దిగుబడి (టన్నుల్లో)	అవసరం (టన్నుల్లో)
16	130

మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా.. (కిలో..రూ.లలో)

బీర్నీస్	చిక్కుడు	క్యాప్సికం	బీరకాయ
80	80	80	60
క్యారెట్	పచ్చిమిర్చి	సొరకాయ	బెండకాయ
60	60	60	60
ఆలుగడ్డ 40	వంకాయ 40	టమాట 15	

మరికల్: రాత్రనకా.. పగలనకా ఎంతో కష్టపడి కూరగాయలను సాగు చేస్తున్న రైతును అటు దళారులు, వ్యాపారులు నిండా ముంచుతున్నారు. నేరుగా పొలాల వద్దకు వెళ్లడం.. తక్కువ ధరకు కూరగాయలు కొనుగోలు చేయడం.. బయటి మార్కెట్‌లో అంతకు రెండు మూడింతలు ఎక్కువకు విక్రయిస్తూ రైతు కష్టాన్ని వీరు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతుకు కష్టం తప్ప లాభం దక్కడం లేదు. సుమారు మూడు నుంచి నాలుగు నెలల పాటు విత్తనాలు, నారు, కలుపు, ఎరువులు, కూలీలు, రవాణా తదితరాలన్నీ కలిపి ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.40 వేల పెట్టుబడి ఖర్చు అవుతున్నాయి. రైతుల వద్ద కొనుగోలు చేసిన కూరగాయల్ని విక్రయిస్తున్న దుకాణదారులు, మధ్యవర్తులు ఏకంగా అధిక లాభాన్ని పొందుతున్నారు. ప్రస్తుతం రైతుల నుంచి టమాటాను కిలో రూ.5 నుంచి 10 కొంటున్నారు. వీటినే మార్కెట్‌లో కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. మొత్తంగా లాభం లేకపోవడంతో రైతులు నానాటికి కూరగాయల సాగును తగ్గించి వరి, ఇతర పంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

రైతులకు నష్టమే మిగులుతోంది..



కష్టపడి పండించిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్తే దళారులు, వ్యాపారులు కిలో టమాట రూ.5కు అడుగుతారు. తమతో ప్రతి కూరగాయల్ని తక్కువ ధరలకే కొనుగోలు చేసి వారు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రేయనకా.. పగలనకా కష్టపడి కూరగాయలు పండించిన రైతుకు నష్టాలు వస్తే.. వ్యాపారులకు మాత్రం లాభాలు గడిస్తున్నారు. – మణెమ్మ, మందిపల్లితండా

వ్యాపారులే లాభపడుతున్నారు..



వారాంతపు సంతలో కూరగాయల ధరలు రైతులు నేరుగా విక్రయిస్తే తక్కువ ధర ఉంటుంది. అదే వ్యాపారులతో అధిక ధరలు ఉంటున్నాయి. చాలామటుకు దళారులు.. పొలాల వద్దకు, లేదా రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన వెంటనే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అనంతరం వినియోగదారులకు అధిక ధరకు విక్రయించి తీవ్రంగా ముంచుతున్నారు. పంట పండించిన రైతులు నష్టపోతుండగా.. వ్యాపారులు అధిక లాభం పొందుతున్నారు. మొత్తంగా రైతు, వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. – లక్ష్మమ్మ, పెద్దచింతకుంట

కర్ణాటక.. ఆంధ్ర నుంచి దిగుమతులు

కూరగాయల సాగును జిల్లాలో రైతులు తగ్గిస్తూ వస్తుండడంతో విధిలేని పరిస్థితిలో బయటి నుంచి దిగుబతి చేసుకోవాల్సి వస్తోంది. జిల్లాకు సమీపంలోని కర్ణాటక రాష్ట్రం రాయచూర్, యాద్గీర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాల నుంచి చాలావరకు కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో రవాణా ఖర్చులు కలిపి వ్యాపారులు కూరగాయల ధరలను నిర్ణయిస్తున్నారు. జిల్లాలో గత 15 ఏళ్ల నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నా రైతులు కూరగాయల సాగును తగ్గించి పత్తి, వరిపైనే మక్కువ చూపుతున్నారు. ఉద్యాన శాఖ అధికారులు మార్కెట్‌లో కూరగాయలకు ఉన్న డిమాండ్‌పై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు.. బయటి మార్కెట్‌లో వచ్చే లాభాలు రైతుకు అందేలా చూస్తేనే జిల్లాలో సాగు పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో మరికల్, ధన్వాడ, ఊట్కూర్, దామరగిద్ద, కోస్గి మండల్లాలో మాత్రమే అరకొరగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇవి జిల్లా అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇక్కడ కేవలం ఒక గుంట, లేక అర ఎకరా లోపు మాత్రమే కూరగాయలు సాగు చేయడం వల్ల అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఒక రైతు రెండు నుంచి మూడు ఎకరాలకు పైగా కూరగాయలను సాగు చేసి ఇతర పంటలకు మార్కెటింగ్ చేస్తే మంచి లాభాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ పరిస్థితి లేకనే గ్రామాల్లో జరిగే వారాంతపు సంతలకు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన కూరగాయలను విక్రయిస్తున్నారు. నారాయణపేట, మక్తల్, మద్దూరు, మరికల్ మండల్లాలో జరిగే వారాంతపు సంతలకు ఎక్కువగా కర్ణాటకలోని రాయచూర్ నుంచి దిగుమతి అవుతున్నాయి. మద్దూరు, కోస్గి మండల్లాలో జరిగే సంతలకు సరిహద్దు ప్రాంతాలతో పాటు కర్నూల్ జిల్లా నుంచి వస్తున్నాయి. 70 శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నవే జిల్లా అవసరాలను తీర్చడం గమనార్హం. క్యాప్సికం, క్యాబేజీ, క్యారెట్, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్, బీర్నీస్, ముల్లంగి సాగు మాత్రం జిల్లాలో నామమాత్రంగా ఉంది. ఇక్కడ కేవలం టమాటా, బీర, బెండకాయ, దొండకాయ, చిక్కు డు.. ఆకు కూరగాయలు మాత్రం నామమాత్రంగా పండిస్తున్నారు. ఇవి ఏవి కొనుగోలు చేసినా కిలో రూ.60 పైనే ఉండడంతో సామాన్య, పేద ప్రజలు కొనుగోలు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు.



అప్పంపల్లిలో బెండతోట పండిస్తున్న మహిళా రైతు

పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రభుత్వ పాఠశాలలకు విడుదలైన పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పీఎంశ్రీ కార్యక్రమం అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పీఎంశ్రీ పథకానికి మొదటి విడతగా 12 పాఠశాలలు, రెండో విడతగా ఏడు పాఠశాలలు ఎంపికయ్యాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని డీఈఓ గోవిందరాజులుకు సూచించారు. సంబంధిత పాఠశాలల్లో చేపట్టిన పనుల పూర్తి వివరాలతో డాక్యుమెంట్ తయారుచేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి వార్షిక పరీక్షలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వచ్చే నెలలో పదో తరగతి పరీక్షలు జరగబోతున్నాయని.. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గణిత, భౌతిక శాస్త్రంలో విద్యార్థులు వెనకబడి ఉన్నారని.. వారికి పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా చూడాలన్నారు. ఈ విషయంపై సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించాలని డీఈఓకు సూచించారు. జిల్లాలోని సబ్జెక్టు ఫోరమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తగు సూచనలు ఇవ్వాలని, సబ్జెక్టుల వారీగా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు మూడవ స్లిప్ టెస్ట్ పూర్తయిన తర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని.. జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎఫ్ఏఓ చారి, సెక్టోరియల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, రాజేంద్రకుమార్, నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ.. ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. మండలాల వారీగా సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. మాస్టర్ ట్రైనర్స్‌చే వీరికి శిక్షణ తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి, డీపీఓ కృష్ణ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి రాజీమార్గం ఉత్తమం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ

నారాయణపేట: చిన్నచిన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని.. వచ్చే నెల 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ఆవరణలో జరిగిన కోఆర్డినేషన్ సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. రాజీ అయ్యే కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. యాక్సిడెంట్, పరస్పర దాడులు, చీటింగ్, వివాహ బంధానికి సంబంధించిన కేసులతో పాటు చిన్నచిన్న చోరీల కేసులు, కరోనా సమయంలోని కేసులు, డ్రంకెన్ డ్రైవ్ తదితర కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. జిల్లాలోని నారాయణపేట పట్టణ, రూరల్, మాగనూరు, మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణా, నర్వ, మరికల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈపెట్టి, డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎక్సైజ్ శాఖలో ఉన్న పెండింగ్ కేసులను క్లియర్ చేయాలన్నారు. మొత్తం 6,540 కేసులను క్లియర్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి మహమ్మద్ ఉమర్, అడిషనల్ జూనియర్ జడ్జి సయ్యద్ జాకియా సుల్తానా, డీఎస్పీ లింగయ్య తదితరులు ఉన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే సహించం



మాట్లాడుతున్న వార్ల విజయ్‌కుమార్

కోస్గి రూరల్: వెనకబడిన కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డితో కలిసి మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌ను మరో సిరిసిల్లగా మారుస్తానని హామీ ఇచ్చి ఎడారిగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తుంటే.. ఓర్వలేక అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. పట్టణంలో రోడ్డు వెడల్పు బాధితుల కోసం రూ. 7కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే రైతుల బ్యాంకు ఖాతాలో రైతుభరోసా డబ్బులు జమ అవుతున్నాయని.. తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పలువురికి సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, అన్న కిష్టప్ప, విక్రంరెడ్డి, హరి, రాజేష్, భానునాయక్, నర్సింహ, రాంబాబు, బాల్‌రాజ్, కృష్ణమూర్తి, సోమశేఖర్, సుధాకర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రత్యేకమా.. పొడిగింపా?

14న ముగియనున్న 'సహకార' పాలకవర్గాల గడువు

- ఆరు నెలల వరకు ఎన్నికల నిర్వహణ అనుమానమే..
- పదవీకాలం పొడిగించాలని కోరుతున్న చైర్మన్లు
- స్పెషలాఫీసర్ల నియామకానికి అధికారుల కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 87 సహకార సంఘాలు



అచ్చంపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

అచ్చంపేట: రైతులకు క్షేత్రస్థాయిలో సాగుపరమైన సేవలందిస్తూ.. అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 14తో ముగియనుంది. అయితే వీటికి ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం నేపథ్యంలో ఆ తర్వాతే వీటి ఎన్నికలు ఉంటాయని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే బ్యాంకు కార్యకలాపాలన్నీ ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉండటంతో ప్రత్యేకాధికారుల పాలనతో వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలనే మరో ఆరు నెలలు పొడిగించాలని డీసీసీబీ నాయకుడొకరు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆవిర్భావ సమయంలోనూ అప్పటి ప్రభుత్వం ఆరు నెలల చొప్పున నాలుగు సార్లు డీసీసీబీ పాలకవర్గాలకు కొనసాగించిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం గడువు పొడిగిస్తుందా.. లేక ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గుచూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే సొసైటీల ప్రత్యేకాధికారుల నియమాకానికి ఉమ్మడి జిల్లాలోని సహకార శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆరు నెలల ముందుగానే ప్రక్రియ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 76 సొసైటీలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ డీసీసీబీ పరిధిలోని ఐదు జిల్లాలు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధులు కలుపుకొంటే మొత్తం 87 పీఏసీఎస్‌లు ఉన్నాయి. అయితే పీఏసీఎస్‌లకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 14న ఎన్నికలు నిర్వహించింది. సొసైటీ పరిధిలో ఎన్నికైన చైర్మన్లతో అదే నెల 25న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. పలువురు డైరెక్టర్లను సైతం ఎన్నుకున్నారు. ఈ పాలకవర్గాల గడువు ఈ నెల 14తో ముగుస్తుంది. సాధారణంగా సొసైటీల కాలపరిమితి ముగిసే ఆరు నెలల ముందుగానే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియ చేపట్టి గడువు వరకు పూర్తిచేసేది. అయితే ప్రస్తుతం వీటి నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన అనివార్యంగా మారింది.

జిల్లాకో కేంద్ర బ్యాంకు..

కొత్త జిల్లాలు ఏర్పడినా ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆధ్వర్యంలోనే ఏడు జిల్లాల ప్యాక్స్‌లను నిర్వహిస్తున్నారు. కొత్తగా జిల్లాకో కేంద్ర బ్యాంకు ఏర్పాటు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతోంది. అయితే ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టనున్న నేపథ్యంలో ఎన్నికలు ఒకే డీసీసీబీ కింద నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా కొత్తగా 40 ప్యాక్స్‌లను ఏర్పాటు చేయాలని అధికారులు గతంలో ప్రభుత్వానికి నివేదిక పంపారు.

మండల స్థాయి అధికారులు

ప్రత్యేక పాలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. అయితే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు ప్రభుత్వం ఇప్పటికే స్పెషలాఫీసర్లను నియమించిన సంగతి తెలిసిందే. సహకార సంఘాలకు సైతం అదే మాదిరిగా ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సహకార శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ స్థాయి అధికారులను సొసైటీలకు ప్రత్యేకాధికారులుగా నియమించవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సొసైటీకి ఒక్కొక్కరిని నియమిస్తారా.. లేక రెండు, మూడు సొసైటీలకు కలిపి ఒకరిని నియమిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఆదేశాలు రాలేదు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈ నెల 14న ముగియనుంది. అయితే ప్రత్యేకాధికారులను నియమిస్తుందా.. లేక పాలకవర్గాల గడువు పొడిగిస్తుందా.. అనే దానిపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం. – రఘునాథరావు, జిల్లా సహకార శాఖాధికారి, నాగర్‌కర్నూల్

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో సహకార సంఘాలు ఇలా..

డీసీసీబీ	డీసీఎంఎస్	మహబూబ్‌నగర్	నారాయణపేట	వనపర్తి	జోగుళాంబ గద్వాల
1	1	17	10	15	11
నాగర్‌కర్నూల్ 23			రంగారెడ్డి, వికారాబాద్ 11		

క్లుప్తంగా

రైతు బలవన్మరణం


చిన్నయ్య (ఫైల్)

తాడూరు: పురుగుమందు తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ గురుస్వామి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన రైతు చిన్నయ్య (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. పంటల సాగుకు చేసిన అప్పు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగాడు. గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జడ్చర్ల: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లక్ష్మీనారాయణ కాంపౌండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. మండలంలోని జయప్రకాశ్‌నగర్‌కు చెందిన శీకురు శంకర్(33) మేస్త్రీ పని చేసేవాడు. పనికోసం ఇంటి నుంచి బయలుదేశాడు. బాదేపల్లిలోని లక్ష్మీనారాయణ కాంపౌండ్ వద్ద రోడ్డుపై పడి మృతిచెందాడు. అతడికి ఫిట్స్ వచ్చేవని, మద్యం తాగే అలవాటు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో ఓ దొంగతనం కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడు. మృతుడికి భార్య శ్రీదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వ్యక్తి..

గద్వాల క్రైం: మద్యం తాగి ఒక్కసారిగా కుప్పకూలి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం సాయంత్రం గద్వాల పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చేనుగోనిపల్లి గ్రామానికి చెందిన దౌలత్(44) పట్టణంలోని ఓవైన్స్ వద్ద చిప్ లిక్కర్ క్వార్టర్ బాటిళ్లను తీసుకొని అక్కడే మద్యం సేవించాడు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన వైన్ షాపు నిర్వాహకులు లేపే ప్రయత్నం చేయగా చలనం లేదు. పట్టణ పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుండెపోటుకు గురై మృతిచెంది ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

చెరువులో పడి యువకుడు..

మహమ్మదాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం పులుసుమామిడికి చెందిన గణేష్ (22) మండలంలోని గాధిర్యాల్‌లో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు సోమవారం వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం తోటి బంధువులతో కలిసి దుస్తులు శుభ్రం చేసుకునేందుకు గ్రామ సమీపంలోని ఏటి చెరువుకు వెళ్లి ప్రమావశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. పరిసర పొలాల రైతులు వచ్చి బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి మహిళ..

మహమ్మదాబాద్: ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ మంగళవారం పడిగ్యాల్ చెరువులో శవమై తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. గండేడ్ మండలంలోని పగిడ్యాల్ గ్రామానికి చెందిన చెంచు పద్మమ్మ(38) ఆదివారం ఇంటిలో చిన్నపాటి గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త మైబు ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు, బంధువులకు సమాచారం అందించారు. చివరికి రెండురోజుల తర్వాత మంగళవారం పగిడ్యాల్ మల్లమ్మచెరువులో శవమై తేలింది. పద్మమ్మకు భర్తతోపాటు ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై భర్త మైబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు.

నవోదయ ఏర్పాటుకు కసరత్తు


మహబూబ్‌నగర్‌లోని దుర్గాభాయ్ మహిళా శిశు వికాస కేంద్రం

- దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్ భవనంలో తాత్కాలికంగా నిర్వహణ
- ఇటీవలే పరిశీలించిన అధికారులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు
- శాశ్వత నిర్మాణానికి రెండు చోట్ల స్థల పరిశీలన


భవనాన్ని పరిశీలిస్తున్న నవోదయ అధికారులు, డీఈఓ ప్రవీణ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో దాని ఏర్పాటుకు సంబంధించి జిల్లా అధికారులు కసరత్తు ప్రారంభించారు. 2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు సమాచారం. అందులో భాగంగా తాత్కాలిక భవనంలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు భవనాన్ని సైతం అధికారులు ఇటీవలి పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న దుర్గాభాయ్ మహిళా శిశువికాస కేంద్ర భవనాన్ని విద్యాశాఖ, నవోదయ విద్యాలయ అధికారులు పరిశీలించారు. ఇందులో నాలుగు బ్లాక్‌లుండగా రెండు బ్లాక్‌ల్లో తరగతులు బోధించేందుకు అవకాశాలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ భవనంలో దాదాపు ఖరారు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. ఇటీవలి నవోదయ ప్రవేశ పరీక్షను ప్రభుత్వం నిర్వహించింది. అన్ని అనుకూలిస్తే ఈ ప్రవేశ పరీక్షలోనే విద్యార్థులకు సీట్లను సైతం కేటాయించనున్నారు. మొదట 6వ తరగతిలో అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇందులో రెండు సెక్షన్లలో అడ్మిషన్లు ఉండగా ఒక్కో సెక్షన్‌లో 40మంది విద్యార్థుల చొప్పున మొత్తం 80మంది ప్రవేశాలు పొందనున్నారు. ఈభవనంలో మైనర్ రిపేర్లు, రంగులు వేస్తే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

సంతోషకర విషయం..



జిల్లాలో నవోదయ విద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేయడం సంతోషకర విషయం. స్థలం కేటాయించేందుకు జిల్లా కేంద్రంలోని వీరన్నపేట్, గండీడ్ మండలంలో రెండు ప్రతిపాదనలు వెళ్లాయి. ఎక్కడ ఏర్పాటుచేసినా జిల్లా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. నవోదయ విద్యాలయ ఏర్పాటుతో విద్యాపరంగా మరింత అభివృద్ధి జరుగుతుంది.
– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

తాత్కాలిక భవనంలో ..



నవోదయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి రెండు స్థలాలను ప్రతిపాదనలు పంపాం. తాత్కాలికంగా వచ్చే విద్యాసంవత్సరంలో తరగతుల ఏర్పాటుకు సంబంధించి జిల్లా కేంద్రంలోని దుర్గాభాయ్ మహిళా శిశు వికాస కేంద్రాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించాం. ఇక్కడ అన్నివసతులు ఉన్న కారణంగా ప్రతిపాదనలు పంపించాం. అనుమతులొస్తే వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తాం.
– ప్రవీణ్‌కుమార్, డీఈఓ, మహబూబ్‌నగర్

20ఎకరాల భూమి అవసరం

నవోదయ విద్యాలయ నిర్మాణం కోసం కనీసం 20ఎకరాల భూమి అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో తరగతి గదులు, హాస్టల్ వసతి, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్లు, క్రీడా మైదానం, స్టాఫ్ క్వార్టర్స్ వంటివి అవసరం పడుతుంది. ఈక్రమంలో అవసరమైన భూమిని సేకరించేందుకు అధికారులు రెండు ప్రాంతాల్లో భూమిని పరిశీలించి ప్రభుతానికి ప్రతిపాదనలు పంపించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని వీరన్నపేట్, గండీడ్ మండల కేంద్రంలో కూడా ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈరెండు స్థలాల్లో ఎక్కడో ఓ దగ్గర నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు అవకాశాలున్నాయి.

నేడు కురుమూర్తిస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ



కురుమూర్తి స్వామి గిరులు

చిన్నచింతకుంట: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని కురుమూర్తి స్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ, మహా యజ్ఞం నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు శివన్న తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రదక్షణ కార్యక్రమం కురుమూర్తిస్వామి పాలక మండలి సౌజన్యంతో మహర్షి సాదూ మహారాజ్ శ్రీ రఘోత్తమఆచార్య మహాస్వాముల వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై దైవానుగ్రహం పొందాలని ఆయన కోరారు.

గిరి ప్రదక్షిణతో ఆయుస్సు, ఆధ్యాతికత..

గిరి ప్రదక్షిణతో మానవుడి ఆయుస్సు పెరగడంతో పాటు ఆధ్యాతికతను పెంచుతుంది. ప్రదక్షణ ద్వారా మానవునిలోని ప్రతి అవయం కదలిక చెందు తుంది. తద్వారా మానవునిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గిరి ప్రదక్షిణలు శివాలయం, విష్ణు ఆలయాలవద్ద గిరులు ఉన్న చోట నిర్వహిస్తారు. గిరి ప్రదక్షిణ ఈశాన్యం నుంచి ప్రారంభించి ఆగ్నేయం, నైరుతి దిశగా ఈశాన్యానికి చేరుకోవాలి. అనంతరం ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుంటే దైవానుగ్రహం కలిగి విశ్వశక్తి మానవుడిపై ప్రసరించి సంపూర్ణ ఆయురారోగ్యాలు పొందుతారు.

లోక కల్యాణం కోసం..



లోక కల్యాణార్థం గిరి, ఆలయ ప్రదక్షిణ మహాయజ్ఞం కార్యక్రమాలు చేపడుతున్నాం. యజ్ఞంతో సమస్త మానవాళికి మంచి జరుగును. ప్రదక్షిణలతో ఆరోగ్యానికి మేలు జరుగును. – శ్రీరఘోత్తమఆచార్యస్వామి, శ్రీజ్ఞానపీఠం అంతర్జాతీయ ధార్మిక, వ్యక్తి వికాస శిక్షకులు

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర

క్వింటాల్ గరిష్టంగా రూ.2,810, కనిష్టంగా రూ.1,850


మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లి

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహించారు. బుధవారం మన్యంకొండ జాతర సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే ఉల్లి వేలం జరిగింది. గత వారం వచ్చిన ధరలతో పోల్చితే ఈ వారం స్వల్పంగా పెరిగాయి. నాణ్యంగా ఉన్న తెల్ల ఉల్లి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,810, కనిష్టంగా రూ.1,850 వరకు ధర వచ్చింది. ఇక మార్కెట్‌కు నాణ్యంగా ఉన్న ఉల్లి తక్కువగా రావడంతో వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. చిరు వ్యాపారులు, వినియోగదారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.1,400, కనిష్టంగా రూ.9,50 వరకు అమ్మకాలు సాగించారు.

కందులు క్వింటాల్ రూ.7,051

దేవరకద్ర మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,051, కనిష్టంగా రూ.6,871 ధరలు లభించాయి. మార్కెట్‌కు దాదాపు వంద బస్తాల కందులు అమ్మకానికి వచ్చాయి.

‘కమ్యూనిజాన్ని అంతం చేయలేరు’


నివాళులు అర్పిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు

మక్తల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెయ్యి జన్మలెత్తినా కమ్యూనిజాన్ని అంతం చేయలేరని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని దాసర్‌పల్లికి చెందిన జిల్లా సీపీఐ కార్యదర్శి కొండన్న సంస్మరణ సభ మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించగా ఆయనతో పాటు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పాల్గొని కొండన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీహెచ్ కొండన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేశారని, పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు నిస్వార్థంగా సమాజ హితం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల పక్షాన గొంతు వినిపించే కొండన్న మనమధ్యలో లేకపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వంలో దేశంలోని అన్నిరంగాలు దివాళా తీస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగ పీఠికకు సమాధి కడుతూ సార్వభౌమాధికారాన్ని సామ్రాజ్యవాద దేశాలకు తాకట్టు పెడుతూ దేశసంపదను కొల్లగొడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ, విజయరాములు, జిల్లా కార్యదర్శి బాలకిషన్, నర్సింహ, సంతోష్, కిరణ్, భగవంతు, చంద్రశేఖర్, గోవిందరాజ్, శెట్టి, శ్రీహరి, రాము, వెంకటేశ్, రమేశ్, పద్మావతి, నాగరాజు, అల్వాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు విరమణ


దీక్ష చేస్తున్న వారికి నిమ్మరసం అందజేస్తున్న తహసీల్దార్ రామ్మోహన్

రాజోళి: ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండలంలోని పెద్ద ధన్వాడలో 20 రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షలు మంగళవారం విరమించారు. తహసీల్దార్ పి.రామ్మోహన్, సీఐ టాటాబాబు, ఎస్ఐ జగదీశ్ పెద్ద ధన్వాడలోని దీక్షా శిబిరానికి చేరుకొని ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులతో మాట్లాడారు. దీక్ష విరమిస్తే ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి రద్దు చేసేలా, ప్రజలకు అనుకూలంగా నిర్ణయం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారని.. ప్రజల సంక్షేమానికి ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని కాంగ్రెస్ నాయకులు వివరించారు. అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తారని.. అభిప్రాయాలను వెలిబుచ్చి నిర్ణయాన్ని ప్రకటించేలా చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా దీక్ష చేస్తున్న వారికి కాంగ్రెస్ నాయకులు, పోలీస్, రెవెన్యూ అధికారులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

సరిహద్దులో వాహనాల తనిఖీ


అలంపూర్ చౌరస్తా సమీపంలోని చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన కోళ్ల వాహనాలు

30 వేల కోళ్లు వెనక్కి

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పశు సంవర్ధక శాఖ అధికారులు, పోలీసుల తనిఖీలు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా అలంపూర్ పశు సంవర్ధక శాఖ అధికారి శంకరయ్య, ఉండవెల్లి ఎస్ఐ మహేష్ కోళ్ల వాహనాలను తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ నుంచి వచ్చే కోళ్ల వాహనాలను రాష్ట్రంలోకి రాకుండా నిరంతరం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో త్రిపుర నుంచి కామారెడ్డికి కోళ్లతో వెళ్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా దాదాపు 30 వేల కోళ్లు ఉన్నట్లు గుర్తించి.. వాటిని రాష్ట్రంలోకి ప్రవేశించకుండా వెనక్కి పంపినట్లు తెలిపారు. కోళ్లకు వస్తున్న వైరస్ వ్యాప్తి రాష్ట్రంలోకి చేరకుండా చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి వాటిని వెనక్కి పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రైవేట్ బస్సు అపహరణ


లింగంపేట వద్ద లభించిన బస్సు

జడ్చర్ల: గుర్తుతెలియని వ్యక్తి ఓప్రైవేట్ బస్సును అపహరించిన సంఘటన జడ్చర్లలో మంగళవారం చోటుచేసుకుంది. సిగ్నల్‌గడ్డ–కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఓబల్క్ డ్రగ్ పరిశ్రమకు సిబ్బందిని తరలించేందుకు తెల్లవారుజామున బస్సును సిద్ధం చేసిన డ్రైవర్ సమీపంలోని ఆలయంలో స్వామి దర్శనార్థం వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి బస్సు కనిపించలేదు. విషయాన్ని తమ యజమానికి తెలియజేసి గాలింపు చేపట్టారు. మండలంలోని లింగంపేట గ్రామ సమీపంలో రోడ్డుకు దిగువన మట్టిలో కూరుకుపోయిన బస్సును గుర్తించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ట్రావెల్స్ నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కుక్క స్వైర విహారం

- రోడ్డుపై వెళ్లేవారిపై దాడి
- ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి తరలింపు


కుక్క దాడిలో గాయపడిన మహిళ


కుక్కదాడిలో వ్యక్తి కాలికి అయిన గాయం

జడ్చర్ల టౌన్: స్థానిక నేతాజీచౌరస్తా నుంచి పాతబస్టాండ్ రోడ్డులో మంగళవారం ఓ కుక్క స్వైర విహారం చేసి పాదాచారులను భయబ్రాంతులకు గురిచేసింది. కుక్కదాడిలో పలువురికి గాయాలైనట్లు ప్రచారం జరుగుతుండగా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం ఆరుగురు వచ్చారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం ఓ కుక్క నేతాజీ చౌరస్తాలో కొందరిని గాయపరిచింది. సిగ్నల్‌గడ్డ జెడ్పీహెచ్‌ఎస్ వద్ద ఓ టీచర్‌పై దాడిచేసింది అతడిని గాయపర్చి పట్టుకునేలోగానే కనిపించిన వారిపైకి దూకుతూ భయబ్రాంతులకు గురిచేస్తూ పాతబస్టాండ్ రోడ్డు వరకు వెళ్లింది. 23వ వార్డులోకి వెళ్లి అక్కడ ముగ్గురు మహిళలను గాయపర్చింది. కుక్కదాడి విషయం మున్సిపల్ సిబ్బందికి అందగా వారు దానిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రంవరకు జాడ దొరక్కపోవటంతో ఏబీసీ కేంద్రానికి సమాచారం అందించారు. గాయపడిన ఆరుగురు చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. వారిలో ముగ్గురికి తీవ్రగాయాలు కావటంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురికి ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. కుక్క పిచ్చిదా మామూలుదా అన్నది తేలాల్సి ఉంది. కుక్క స్వైరవిహారంతో స్పందించిన కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే కుక్కలను నియంత్రించాలని కోరారు. స్పందించిన కమిషనర్ కుక్కలను పట్టుకునేందుకు మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక బృందాలను రప్పించనుననట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఇటిక్యాల మండలం మొగిలరావు గ్రామానికి చెందిన బోయరాజు మండలంలోని కాకులారం గ్రామంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గ్రామస్తుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి రాయచూరుకు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఉదయం వాహన తనిఖీలు చేసినట్లు వివరించారు. గ్రామ శివారులో గూడ్స్ వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

సత్తాచాటిన వాగ్దేవి విద్యార్థులు


రేవంత్‌రెడ్డి


నవనీత్


నవీన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్స్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ మేరకు ఫలితాల్లో కళాశాల విద్యార్థులు రేవంత్‌రెడ్డి 97.27 పర్సంటైల్, నవనీత్‌గౌడ్ 90 పర్సంటైల్ సాధించారు. వీరితోపాటు నవీన్, అశ్విన్, రామ్, చరణ్, జునేత్, ఓంకార్, ఆర్తి, సురేష్‌నాయక్, కస్తూరి, శివ, ప్రభాస్, గోవింద్ అత్యుత్తమ పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌కు ఎంపికయ్యారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతూనే జాతీయ స్థాయి జేఈఈ పరీక్షలో సత్తా చాటడం గొప్ప విషయం అన్నారు. ఏప్రిల్‌లో జరిగే రెండో దశ పరీక్షలో మరింత మెరుగ్గా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, అధ్యాపకులు రాఘవేందర్‌రావు, షాకీర్, యాకుబ్, సందీప్, గోవిందరాజులు, రాంరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతిభ’ విద్యార్థుల జయభేరి


కేదార్‌నాథ్


వర్షిత్‌గౌడ్


వాత్సల్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌లో జిల్లాకేంద్రంలోని ప్రతిభ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో జయభేరి మోగించారు. ఈ మేరకు కళాశాలకు చెందిన విద్యార్థులు కేదార్‌నాథ్ 98.28 పర్సంటైల్, వర్షిత్‌గౌడ్ 98.15, జీఎల్ఎస్ఎస్ వాత్సల్య 98.06, విశాల్ 97.12, నాగకౌశిక్ 96.95, సి.జతిన్ 96.3, భరత్ 96.16, భానుప్రదీప్ 95.43, సాయి జశ్వంత్‌రెడ్డి 95.39, శివశంకర్ 94.3, సాకేత్ 94.19, అంజని చరణ్య రాఘవ్ 94.01, నరేష్ 93.20, వైష్ణవి 93.84, అభిరామ్ 92.99, మల్లేష్ 92.92.42, మానస 92.1 సాధించగా 90కి పైగా పర్సంటైల్ 42 మంది, 80కిపైగా 51 మంది సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్స్ మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య అభినందించారు.

‘రిషి’ విజయదుందుభీ


సాయి సుజన్‌రెడ్డి


సాయి అక్షయ


తరుణ్‌సాయి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని రిషి కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ మెదటి విడత ఫలితాల్లో విజయ దుందుభీ మోగించారు. కళాశాల విద్యార్థులు సాయి సుజన్‌రెడ్డి, 98.40 పర్సంటైల్, సాయి అక్షయ 97.80, అరుణ్‌సాయి 96.75, సాహితీ రెడ్డి 95.77, జోయా 95.90, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 94.96, స్వర్ణకుమారి 93.64, ఇస్తర్ 92.09, రోహిత్ 91.61, ఈశ్వర్ 91.61, మనోజ్ఞ 91.20, నివేదిక 91.20తోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. అనంతరం చైర్మన్ చంద్రకళావెంకట్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు ఇంటర్మీడియట్ చదువుతోపాటు పోటీ పరీక్షల్లో కూడా పాల్గొనే ర్యాంకులు సాధించే విధంగా తీర్చిదిద్దుతామని, అందుకే జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ లక్ష్మీరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

డీసీసీబీల పదవీ కాలాన్ని పొడిగించండి

మంత్రి తుమ్మలకు సహకార బ్యాంకుల చైర్మన్ల వినతి

సాక్షి, హైదరాబాద్: ఈ నెలలో ముగియనున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగించాలని వివిధ జిల్లాల సహకార బ్యాంకుల చైర్మన్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సచివాలయంలో మంగళవారం తుమ్మలను కలిశారు. సీఎంతో చర్చించి పదవీ కాలాన్ని పొడిగించేందుకు కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మార్నేని రవీందర్ రావు, డీసీసీబీ చైర్మన్లు కుంభం శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట సత్తయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులున్నారు.

రైతులకు అన్ని రంగాల్లో పెద్దపీట : చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సర కాలంలోనే రైతుల సంక్షేమం కోసం రూ.55,256 కోట్లు వ్యయం చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా ద్వారా సుమారు రూ.40 వేల కోట్లు రైతుల ఖాతాలో నేరుగా జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రైతులకు మంచి చేయాలనే తపనతో నిరంతరం తపిస్తోందని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు.

ఆరేళ్లకే నూరేళ్లు

గుండెనొప్పితో బాలుని హఠాన్మరణం


విజయ్ సూర్య(ఫైల్)

గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారానికి చెందిన మడిత్తిల్ విజయ్ సూర్య (6) గుండెనొప్పితో మంగళవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి. ధర్మారానికి చెందిన బాబి–కల్యాణి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు విజయ్‌సూర్య ఎల్‌కేజీ చదువుతున్నాడు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనానంతరం ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. వెంటనే విజయ్‌సూర్యకు కుటుంబ సభ్యులు ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కానీ పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు.

మినీ మేడారం.. భక్తజన సందోహం

నేటి నుంచే సమ్మక్క- సారలమ్మ జాతర | **ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి భక్తుల రాక** | **ఏర్పాట్లు చేసిన ములుగు జిల్లా అధికార యంత్రాంగం**



సాక్షి ప్రతినిధి, వరంగల్: మినీ మేడారం (మండమెలిగె పండుగ) జాతరకు వేళయ్యింది. వనదేవతలు సమ్మక్క–సారలమ్మ పునఃదర్శనానికి సమ యం ఆసన్నమైంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర.. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ముగిసిన ఏడాదికి అదే మాదిరిగా మినీ మేడారం జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి 15వ తేదీ వరకు జాతర జరగనుంది. ఈ జాతర ప్రారంభానికి వారం రోజుల ముందు గుడిమెలిగె నిర్వహించారు.

మండమెలిగె ఇలా..

మేడారంలో నేటినుంచి 15వ తేదీ వరకు మినీ జాతర (మండమెలిగె పండుగ) జరుగనుంది. వారం రోజుల నుంచే భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు.

- 12న (బుధవారం) మేడారం, కన్నెపల్లిలోని ఆలయాల్లో మండమెలిగె పండుగను సమ్మక్క–సారలమ్మ పూజారులు నిర్వహిస్తారు. మేడారంలో సమ్మక్క పూజారులు అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు చేసి గ్రామ పొలిమేరలోని తూర్పు, పడమరన ధ్వజస్తంభాన్ని పాతి మామిడి తోరణాలు కడతారు. రాత్రి సమ్మక్క గుడి నుంచి పూజా సామగ్రిని తీసుకొని సమ్మక్క గద్దె వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు. సారలమ్మ పూజారులు కూడా కన్నెపల్లిలో అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి రాత్రి మేడారంలోని గద్దెల ప్రాంగణానికి చేరుకొని అలుకుపూత అనంతరం పూజలు చేస్తారు. రాత్రంతా జాగారం నిర్వహిస్తారు.
- 13 (గురువారం)న ఉదయం సమ్మక్క–సారలమ్మ గద్దెల నుంచి పూజారులు అమ్మవారి సామగ్రిని తీసుకొని డోలు వాయిద్యాలతో సమ్మక్క గుడికి చేరుకుంటారు. తలస్నానాలు ఆచరించి గుడిలో మరోసారి పూజలు నిర్వహిస్తారు. కన్నెపల్లిలో సారలమ్మ పూజారులు కూడా సారలమ్మ గుడికి వెళ్లి పూజలు చేస్తారు.
- 14 (శుక్రవారం)న భక్తులు వనదేవతలకు మొక్కులు చెల్లిస్తారు.
- 15 (శనివారం)న జాతర ముగియనుంది.

రూ.32 కోట్లతో భక్తులకు ఏర్పాట్లు..

రూ.32 కోట్లతో మినీ మేడారం జాతరకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు సుమారు 10 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పలు శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టింది.

వానాకాలం ధాన్యం ప్రైవేటు వ్యాపారులకే!

- మిల్లుల నుంచి సేకరించాల్సిన సీఎంఆర్ 36.15 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు సేకరించింది 5.42 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం



సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్ ధాన్యం సేకరణలో పౌరసరఫరాల సంస్థకు నిరాశే మిగిలింది. రికార్డు స్థాయిలో కోటిన్నర మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వచ్చిందని ప్రభుత్వం చెబుతున్నా, కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం మాత్రం 53.96 లక్షల మెట్రిక్ టన్నులే. ఇందులో సన్నరకం ధాన్యం 24 లక్షల మెట్రిక్ టన్నులు. కాగా గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో కూడా పౌరసరఫరాల సంస్థ 47.34 శాతం ధాన్యాన్ని మాత్రమే సేకరించగలిగింది. దేశ, విదేశాల్లో బియ్యానికి పెరిగిన డిమాండ్ దృష్ట్యా వానాకాలం సీజన్‌లో పండిన పంటను కల్లాల నుంచే వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. క్వింటాల్‌కు మద్దతు ధర కామన్ వెరైటీకి రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320 చొప్పున కొనుగోలు కేంద్రాల్లో రైతులకు లభించింది. అదనంగా ఈ వానాకాలం సీజన్ నుంచి సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున ప్రభుత్వం బోనస్‌గా ఇస్తామని చెప్పింది. అయినా వ్యాపారులు, రైస్‌మిల్లర్లు సన్న ధాన్యాన్ని నేరుగా రైతుల పొలాల నుంచే మద్దతు ధర కన్నా అదనంగా ఇచ్చి కొనుగోలు చేసిన పరిస్థితి ఈసారి కనిపించింది. బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, జగిత్యాల, పెద్దపల్లి వంటి జిల్లాల్లో రైతులే నేరుగా ధాన్యాన్ని బియ్యంగా మిల్లింగ్ చేయించి విక్రయిస్తున్నారు. రైతులు సొంత అవసరాలకు కూడా బియ్యాన్ని నిల్వ చేసుకోవడం ఈ సీజన్‌లో సాధారణం. దీంతో వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తగ్గుతూ వస్తోంది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో పండిన పంటకు, సర్కార్ సేకరించిన ధాన్యానికి పొంతన లేకుండాపోయింది.

సీఎంఆర్ ఇలా....

వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన 53.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం మిల్లులకు పంపించారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 36.15 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ రూపంలో పౌరసరఫరాల సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటి వరకు కేవలం 5.41 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (15 శాతం) పౌరసరఫరాల సంస్థకు రాగా, మరో 30.73 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. రైస్‌మిల్లులు అధికంగా ఉన్న పెద్దపల్లి జిల్లా నుంచి 42 శాతం సీఎంఆర్‌ను ఇప్పటికే సేకరించారు. తర్వాతి స్థానాల్లో భద్రాద్రి కొత్తగూడెం (39 శాతం), ఖమ్మం (31 శాతం) జిల్లాలు ఉన్నాయి.

రేషన్‌కు అవసరమైన సన్న బియ్యం 24 ఎల్‌ఎంటీ

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఉగాది నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరఫరా చేయాలని యోచిస్తోంది. రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజనం, గురుకుల పాఠశాలలకు సంవత్సరానికి అవసరమయ్యే బియ్యం 24 లక్షల మెట్రిక్ టన్నులు. ఇందుకోసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరమవుతుంది. కానీ ఈ సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ సేకరించిన సన్నధాన్యం 24 లక్షల మెట్రిక్ టన్నులే. ఈ ధాన్యం ద్వారా 16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పంపిణీ చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో వచ్చే యాసంగి సీజన్‌లో వచ్చే సన్న బియ్యాన్ని కూడా పంపిణీకి వినియోగించుకునే అవకాశం ఉంది. వచ్చే నవంబర్ వరకు వానాకాలంలో వచ్చిన సన్న బియ్యాన్ని సరఫరా చేసి, మిగతా నాలుగు నెలలకు యాసంగి బియ్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉందని పౌరసరఫరాల వర్గాలు తెలిపాయి.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తక్షణం టెండర్లు పిలిచి తునికాకు సేకరణ పనులు ప్రారంభించాలని అటవీశాఖకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం విజ్ఞప్తి చేసింది. తునికాకు సేకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సంఘం మంగళవారం అరణ్యభవన్ ఎదుట నిరసన తెలిపింది. అనంతరం పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్‌కు సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ.. ఏటా తునికాకు సేకరణపై ఆధారపడి ప్రత్యక్షంగా ఐదు లక్షల మంది ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతర పేదలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది తునికాకు సేకరణ ప్రక్రియను ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ఆరోపించారు.

జనగామ జిల్లాలో నవోదయ ఏర్పాటు చేయండి

కేంద్రానికి ఎంపీ కావ్య విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: జనగామ జిల్లాలో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర పాఠశాల విద్య శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమిషనర్ ప్రాచీ పాండేలను ఆమె కలిసి వినతి పత్రాలు అందజేశారు. నవోదయ ఏర్పాటుకు కావల సిన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తన అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు కావ్య తెలిపారు.

'తెలంగాణ భవన్‌లో సేవాలాల్ జయంతి నిర్వహిస్తాం'


సాక్షి, హైదరాబాద్: గిరిజనులకు సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని, ఆయన జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం మొదలైందని, రూ. 25 కోట్ల సేవాలాల్ మహరాజ్ భవన్‌ను కేసీఆర్ కట్టించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో గిరిజనులు అనాథలుగా మారారని, గిరిజన కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయడం లేదని, 14 నెలల్లో పద్నాలుగు పైసల పని కాలేదని వారు ఆరోపించారు. గిరిజనులకు కేటాయించిన బడ్జెట్ కూడా ఖర్చు కావడం లేదన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షించిన కేంద్ర బృందాలు


పోల్కంపల్లిలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

అడ్డాకుల/భూత్పూర్: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరును వేర్వేరుగా కేంద్ర బృందాలు గ్రామాల్లో పర్యటించి, పర్యవేక్షించారు. మూసాపేట మండలంలోని పోల్కంపల్లిలో కేంద్ర సీనియర్ సెక్షన్ అధికారుల బృందం సభ్యులు అమిత్ వర్మ, సోనీ కుమారి, మీనా కుమారి, మౌనిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రం పని తీరుపై ఆరా తీశారు. ఆసరా పింఛన్ల లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ పులేందర్, ఏపీఎం చారి, కార్యదర్శి నాగేందర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

- అడ్డాకుల మండలంలోని కందూర్‌లో కేంద్ర సీనియర్ సెక్షన్ అధికారులు అంకిత్ వర్మ, మదన్ గోపాల్ భారతి, దీపక్ వర్మ, ఆశీష్ ద్రాలి పర్యటించి పథకాల అమలుతో పాటు గ్రామ పంచాయతీ నిర్వాహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.
- భూత్పూర్ మండలంలోని శేరిపల్లి (హెచ్) గ్రామ పంచాయతీలో దీపక్‌మీనా, అరవింద్ కుమార్, మహ్మద్ ఖాషిఫ్ అన్సారీ, శశికుమార్ చౌదరి బృందం పర్యటించి.. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, గ్రామాల్లో చేపడుతున్న పనులను ఈజీఎస్ ఏపీవో విమలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు చేపడుతున్న పథకాలు, ప్రజలకు ఏవిధంగా ఉపయోగ పడుతున్న వివరాలను తెలుసుకున్నారు.


భూత్పూర్ మండలం శేరిపల్లిలో ఏపీఓతో వివరాలను తెలుసుకుంటున్న సెక్షన్ ఆఫీసర్లు

నేడు జమ్మిచేడులో పౌర్ణమి వేడుకలు



అలంకరణలో జములమ్మ, పరశురామస్వామి మూల విగ్రహాలు

- జములమ్మ ఆలయ సముదాయాలు ముస్తాబు
- 60 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో కీలక ఘట్టమైన పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆలయ సముదాయాలను శోభాయమానంగా ముస్తాబు చేశారు. సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని.. ఎలాంటి ఇబ్బందులు కాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు.

- బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు 108 కలశాలతో అమ్మవారిని అభిషేకిస్తారు. 5 గంటలకు విశేష పంచామృతాభిషేకం అనంతరం అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. పౌర్ణమి వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచేగాక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. వేడుకల సందర్భంగా జములమ్మ, పరుశరామ ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రస్తుతం ఉన్న క్యూలైన్లతో పాటు అదనంగా మరిన్ని ఏర్పాటు చేశారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, చలువ పందిళ్లు, వైద్యసిబ్బందిని నియమించారు. మహిళలు చీరలు మార్చుకునే గదులు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ రిజర్వాయర్ ఉన్నందున నలుగురు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. 20 మంది ఆలయ సిబ్బందితో పాటు మరో 30 మందికి అదనంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



పౌర్ణమి వేడుకలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. దర్శనానికి క్యూలైన్లలో తోపులాట జరగకుండా చర్యలు తీసుకుంటాం. భక్తులు పోలీసులు, దేవాదాయశాఖ సిబ్బందికి సహకరించాలి.

– పురేందర్‌కుమార్, ఈఓ

పటిష్ట బందోబస్తు..

వేడుకల సందర్భంగా సీఐ టంగుటూరి శ్రీను పర్యవేక్షణలో 10 మంది ఎస్‌ఐలు, 20 మంది ఏఎస్‌ఐ, 70 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు బందోబస్తు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో మూడు ఔట్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దొంగతనాలు జరగకుండా ఆలయ సముదాయం నుంచి మేయిన్‌రోడ్డు వద్ద ఉన్న ఆర్చి వరకు పలుచోట్ల సీసీ కెమెరాలు బిగించారు.


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

జనసంద్రం.. జములమ్మ క్షేత్రం

జములమ్మ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి మంగళవారం స్థానిక భక్తులతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాదిగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఒక్కరోజు దాదాపు 50 వేల మంది ఆలయానికి వచ్చినట్లు అధికారులు వివరించారు. పలువురు భక్తులు కోళ్లు, మేకపోతులు బలిచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పనిచేసే చోట మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

పాలమూరు: పనిచేస్తున్న కార్యాలయాల్లో మహిళలను లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి 2013లో ప్రత్యేక చట్టాలు వచ్చాయని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో మంగళవారం లైంగిక వేధింపులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14, 15 ప్రకారం లైంగిక వేధింపులు అనేది మహిళ ప్రాథమిక సమాన హక్కులను ఉల్లంఘిస్తుందన్నారు. ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. లైంగిక వేధింపుల సెక్షన్ ఇప్పుడు 74 బీఎన్‌ఎస్‌గా మార్చినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఎక్కడికి వెళ్లినా భద్రత లేకుండా పోతుందని, మహిళలకు ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించి న్యాయ సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ మేనేజర్ సురేష్‌కుమార్, అసిస్టెంట్ డివిజన్ మేనేజర్ ఉషాదేవి, ఎల్‌ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.ఇందిర

కమనీయం.. లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

- వేలాదిగా హాజరైన భక్తులు
- మార్మోగిన గోవిందనామ స్మరణ
- ఘనంగా పూలతేరు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్ల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో నిత్యపూజలతో పాటు ఆలయం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణం జరిపించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్ఠించి ఊరేగింపుగా కల్యాణకట్టకు తీసుకువచ్చారు. ఊరేగింపులో శాలిబండ రాఘవేంద్ర భజనమండలి, పాలమూరు రాఘవేంద్ర సేవాసమితి భజనమండలి ఆధ్వర్యంలో కోలాటలు, భజనలు చేస్తూ ముందుకు సాగారు. ఆలయం సమీపంలో ఉన్న ధర్మకర్త నరహరి భీంసేనాచార్య గృహం నుంచి కల్యాణ, వస్త్రాలు, ఒడిబియ్యం మేళతాళాలతో తీసుకొచ్చి వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య కల్యాణం నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు వడిబియ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి ఏటా భక్తులు పెరుగుతుండటం, ఆలయం ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో కల్యాణ మండప నిర్మాణానికి భక్తులు సహకరించాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోరారు.

నేడు రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఆలయం ఎదురుగా పూలతేరును వైభవంగా జరిపించారు. పూలతో రథాన్ని అలంకరించి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి రథాన్ని లాగారు. రథోత్సవానికి స్థానికులు హాజరయ్యారు. బుధవారం రాత్రి పౌర్ణమి పురస్కరించుకుని రథోత్సవాన్ని జరపనున్నారు.


కల్యాణానికి హాజరైన భక్తులు

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో ఎక్కడైనా అక్రమ రవాణా జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు, విక్రయించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుక తరలించడం, నిల్వ చేయడానికి వీలు లేదని, పోలీస్ శాఖ ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న వారికి మాత్రమే ఇసుక రవాణా చేయడానికి అవకాశం ఉందని, సబ్ కాంట్రాక్టర్స్ అంటూ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇసుకు అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా పెంచుతామని పేర్కొన్నారు.